క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



అలంపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారంగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ ద్వారా మండలంలోని గొందిమల్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రెండవ విడతలో 1,374 స్కూల్ యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో సీసీ విజయలక్ష్మి, వీఓఏ భూలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మానవపాడు: మారుతున్న సామజిక, సాంస్కృతిక స్థితిగతులు మానవ జీవన విధానంపై, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా సైకాలజిస్ట్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొంతమందికి మానసిక రోగులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణీకరణ, వలసలు, నిరుద్యోగం, నేరాలు, హింస, ప్రకృతి విపత్తులు మనిషిపై ఒత్తిడి, ఆందోళన, భయం, అసహనం, నిరాశను పెంచుతాయన్నారు. మనిషి శారీరక ఆరోగ్యంపైనే కాక మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మానసిక పరమైన సమస్యలు నిరాశ, విపరీతమైన ఆందోళన, అర్థంలేని భయం ఉంటే త్వరగా మానసిక వైద్య నిపుణిడిని కలవాలని సూచించారు. ప్రతి నెల మొదటి శుక్రవారం ఆరోగ్య కేంద్రంలోనూ, ప్రతి రోజు కలవాలంటే జిల్లా ఆస్పత్రి రూం నంబర్ 12లో ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం అధ్యక్షుడి మృతి



రాజోళి: చేనేత కార్మికుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న దోతెర నారాయణ(81) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీం రాజోళిలో విషాధచాయలు అలుముకున్నాయి. చేనేత కార్మికుల సమస్యలపై నిత్యం స్పందించేవాడిగా ఆయనకు జిల్లాలో మంచి పేరుంది. చేనేత సంఘంతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఆయన మృతి చేనేత కార్మికులకు తీరని లోటని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన మృతిపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలియచేశారు.

ఆరోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

ఎర్రవల్లి: తరుచుగా ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపానికి గురై ఓ వృద్ధుడు ఆత్యహత్యకు పాల్పడిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ స్వాతి కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని కొత్త గార్లపాడుకు చెందిన హరిజన్ సవరన్న (61) కొంతకాలంగా ఆరోగ్యం బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్యహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి కుమారుడు హరిజన్ ఉస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి



అయిజ: రూ. 2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతులు వారి వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ కోరారు. శుక్రవారం మండలంలోని గుడుదొడ్డి, యాపదిన్నె, వెంకటాపురం గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయడానికి ఏఓతో పాటు ఏఈఓలు గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు పర్యటన చేస్తారని తెలిపారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతులు మండలంలో మొత్తం 943 మంది ఉన్నట్లు తెలిపారు. 9వ తేదీ అయిజ రైతువేదిక వద్ద రైతు కుటుంబ సభ్యుల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఏఓ తెలిపారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.

నిల్వ నీటితోనే వ్యాధులు



పెద్ద తాండ్రపాడులో టైర్లలో నిల్వ నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ



వడ్డేపల్లి-రాజోళి రోడ్డులో..

రాజోళి: నిల్వ నీటితోనే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎంపీడీఓ ఖాజామొయినుద్దీన్ అన్నారు. మండలంలోని పెద్ద తాండ్రపాడులో ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇళ్ల వద్ద ఉన్న తొట్టెలు, టైర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదకర దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారులు. పలు కాలనీల్లో ఉన్న నిల్వ నీటిని శుభ్రం చేశారు.

శాంతినగర్: గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్, జక్కిరెడ్డిపల్లి గ్రామాలను ఎంపీడీఓ శుక్రవారం సందర్శించి వర్షపునీరు నిలిచిన ప్రదేశాలను గమనించారు. వెంటనే ఆయా గ్రామాల సిబ్బందితో నీటిని పారబోయించారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నందున దోమల ఉధృతి పెరుగుతుందని, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు. ఇళ్లలో నిల్వ నీటిని పారబోసి కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలను సందర్శించి విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరంగా వంటలు వండిపెట్టాలని, ఫుడ్ పాయిజన్ కాకుండా చూడాలని వంట ఏజెన్సీ వారిని, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు సాత్యకి, ఖలీల్ వున్నారు.



క్యాతూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

వడ్డేపల్లి-రాజోళి రోడ్డులో..

వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డేపల్లి-రాజోళి రోడ్డు సమీపంలోని ప్రధాన కాల్వ నుంచి వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రాజోళి రోడ్డులోని కల్వర్టు వద్ద చెత్తాచెదారం చేరుకుని వర్షపు నీరు నిలిచింది. స్పందించిన మున్సిపల్ అధికారులు సిబ్బందిచే చెత్తను తొలగించి నీరు వెళ్లేందుకు దారి చేశారు. దీంతో ఎగువ నుంచి వస్తున్న వర్షం, మురుగు నీరు దిగువకు వెళ్లడంతో జమ్ములమడుగు కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు

అలంపూర్‌రూరల్: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్రైడే పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పద్మావతి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని క్యాతూర్, గొందిమల్ల గ్రామాలను ఎంపీడీఓ సందర్శించి, అంగన్‌వాడీ, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

రక్తదానం చేస్తే పునర్జన్మనిచ్చినట్లే..



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాలటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేస్తే పునర్జన్మ ఇచ్చినట్లేనని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో రక్తం లభించక మృతి చెందిన ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించడానికి తమవంతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సమాజ హిత కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తల భాగస్వామ్యం పెరిగిందని చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులతో పాటు, పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు 148 మంది రక్తదానం చేశారు. అంతకుముందు తన ఇంట్లో పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య సరిత కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

బడి మానేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ఉప్పేరు శివారులో పత్తి పనులు చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గట్టు: మధ్యలో బడి మానేసిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించి, వారు తిరిగి పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని ఎంపీడీఓ చెన్నయ్య ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం గట్టు ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ చెన్నయ్య సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ అందరూ క్రమం తప్పక పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు గర్వించే స్థాయికి చేరుకోవాలని కోరారు. బడిఈడు పిల్లల చేత పనులు చేయించడం నేరమన్నారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



గట్టు విద్యార్థులతో ఎంపీడీఓ చెన్నయ్య, ఉపాధ్యాయులు

ధరూరు: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, వారితో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఉప్పేరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశానుసారం శుక్రవారం మండలంలోని ఉప్పేరు గ్రామ శివారులో పత్తి పనులు చేస్తున్న విద్యార్థులను కలిసి, వారి పిల్లలను బడికి పంపించే విధంగా ఒప్పించినట్లు తెలిపారు. చాలా రోజులుగా పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి చదువు ప్రాముఖ్యత తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నవీన్, సీఆర్‌పీ ఆజంపాష, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల సర్వే చేపట్టాలి

ఎర్రవల్లి: బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి తప్పులు లేకుండా ఓటర్ల సర్వే చేపట్టాలని ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మునుగాల, శివనంపల్లి గ్రామాల్లో బీఎల్‌ఓలు చేస్తున్న ఓటర్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ భీమ్‌సేన్‌రావు, ఆయా గ్రామాల బీఎల్వోలు, తదితరులు ఉన్నారు.



చెక్కుల పంపిణీ

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామానికి చెందిన సురేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా.. మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి కింద రూ.8,500 చెక్కును ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఉండవెల్లికి చెందిన షేక్షావలి ఆపరేషన్ కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందించారు.

ముమ్మరంగా ఫాగింగ్



ఉండవెల్లి: మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా దోమల నివారణ కోసం పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో కార్మికులు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పాత ఇళ్లల్లో నివసించొద్దు

మానవపాడు: వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పాత ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు నివాసగృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద సమయంలో వాగులు, వంకలు దాటరాదని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సక్రియానాయక్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

అలంపూర్ రూరల్: 11 రోజుల పాటు కొనసాగే వినాయక ఉత్సవాలు ముగిసేవరకు సమస్యలు రాకుండా ఎవరి విధులు వారు నిర్వర్తించాలని తహసీల్దార్ మంజుల సిబ్బందికి ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినాయకుడి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు చేపట్టవల్సిన పనులను ఆమె వివరించారు. మండలంలోని గ్రామాల్లో 75 వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. వినాయకుడి నిమజ్జనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ర్యాలంపాడ్‌లోని తుంగభద్ర బ్రిడ్జి 5వ పిల్లర్ వద్ద నిమజ్జ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బ్రిడ్జి వద్ద విద్యుత్ శాఖ వారు లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాలు చేయాలన్నారు. మండలంలోని గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం మొత్తం ఎంపీడీఓ చూసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదేనన్నారు.

నిమజ్జన స్థలం పరిశీలన

ర్యాలంపాడ్ సమీపంలోని తుంగభద్ర నది బ్రిడ్జిపై వినాయకుడి నిమజ్జనం ఎక్కడ చేయాలని స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి, ట్రాన్స్‌కో ఏఈ శరత్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బాషా, జూనియర్ అసిస్టెంట్ మహేష్, ఎలక్షన్ డీటీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌డీ ఏఈ రాజేశ్వరి, జోగుళాంబ ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్యాచారి, ఆర్‌ఐ మాసుంబాషా, మున్సిపల్ సిబ్బంది నారాయణ, రామాంజనేయులు, మండల వినాయక కమిటీ ఉపాధ్యక్షుడు నర్సన్‌గౌడ్, కార్యదర్శి సంజీవనాయుడు పాల్గొన్నారు.



రోడ్డు తవ్వారు.. వాహనదారులకు తిప్పలు

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, సబ్‌స్టేషన్ మధ్యలో నీరు వెళ్లేందుకు ఎలాంటి అనుమతి లేకుండా బీటీ రోడ్డును విద్యుత్ ఏఈ, లైన్‌మెన్ గురువారం రాత్రి ప్రొక్లేన్ సాయంతో తవ్వించారు. తవ్విన రోడ్డును గమనించని వాహనదారులు వర్షంలో కిందపడి గాయాలపాలయినట్లు తెలిపారు. దాదాపు ఆరుగురికి గాయాలు కాగా.. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐకు ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను వివరణ కోరగా.. తమ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని పేర్కోన్నారు. – ఉండవెల్లి

నీట మునిగిన పంట పొలాలు



మానవపాడు శివారులో మిరప పంటలో నిలిచిన నీటిని చూపుతున్న రైతులు

మానవపాడు: మండల కేంద్రం శివారు పంట పొలాల్లో నిలిచిన వర్షం నీటిని శుక్రవారం ఏడీఏ సక్రియానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులతో వివరాలను సేకరించామన్నారు. స్థానిక రైతువేదిక వద్ద రుణమాఫీ కోసం ప్రత్యేకంగా కుటుంబ నిర్ధారణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా..

మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి మానవపాడు, అమరవాయి, గోకులపాడు, చెన్నిపాడు, పోతులపాడు, కలుకుంట్ల, కొర్విపాడు తదితర గ్రామాల్లో సాగు చేసిన పత్తి, మిర్చి పంటపొలాల్లో వర్షం నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మండలకేంద్రంలోని శోభ హోటల్‌లో వర్షం నీరు చేరడంతో మోటార్ సాయంతో నీటితో పారదోలారు. నారాయణపురంలో అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.



నారాయణపురం అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద..

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయండి



కొట్టుకపోయిన డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అయిజ: పులికల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పోలోనివాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను వెంటనే పూర్తిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధికారులను కోరారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మాణం పనులు, వర్షాలకు కొట్టుకపోయిన డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. డైవర్షన్ రోడ్డును పునర్ నిర్మించకపోవడంతో అంతరాష్ట్ర రోడ్డుపై ప్రయాణించే తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. నిర్మాణం పనులు వేగవంతం చేయాలని, అవసరమైన మేరకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డును బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు భీమసేన్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రం నుంచి పులికల్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం, ఎమ్మిగనూరుకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిలో పోలోనివాగుపై చేపట్టిన బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, డైవర్షన్ రోడ్డు కొట్టుకపోయినా సరే తిరిగి నిర్మాణం చేపట్టడం లేదని బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

ధరూరు: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతరేవులలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, అంగన్‌వాడీ సెంటర్‌లో ఇచ్చే పోషకాహారం క్రమం తప్పకుండా తినాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు ఎస్‌ఏఎఫ్‌పీ ద్వారా ప్రత్యేకంగా పదిహేను రోజులకు ఒకసారి బరువు తీసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనీస్‌బేగం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మిట్టదొడ్డిలో..

గట్టు: మండలంలోని మిట్టదొడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో టీచర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోషణ మాసంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. నేటి కిశోర బాలికలే రేపటి మహిళలు అని, మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. బాలామృతం ప్లస్ ప్రాముఖ్యతను తెలియజేశారు. మహిళల్లో రక్త హీనతను దూరం చేయడానికి సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, మీనావతి, ఉష, నాగేశ్వరి, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



చింతరేవులలో బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

కేటీదొడ్డిలో భారీ వర్షం

కేటీదొడ్డి: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. భారీ వర్షానికి నందిన్నె, కుచినెర్ల గ్రామాల మధ్య వంతెనపై వరదనీరు పారడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. అలాగే పాతపాలెం, కొత్తపాలెం రోడ్డు వర్షానికి కొట్టుకోవడంతో గ్రామాలకు, పొలాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



నందిన్నె బ్రిడ్జిపై పారుతున్న వరదనీరు

కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చుతున్న సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలో కొందరు వ్యక్తులు అక్రమంగా చేపట్టిన కట్టడాలను మున్సిపల్ అధికారులు ప్రొక్లేన్‌తో కూల్చివేసే కార్యక్రమాన్ని శుక్రవారం కొనసాగించారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాల యజమానులు రోడ్డుపై మెట్లు, రేకుల షెడ్లు నిర్మించడంతో రోడ్డు వెడల్పు తగ్గిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్రమ కట్టడాలతో పాటు రోడ్డు పక్కన చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు, షెడ్లు, గుడారాలను తొలగించే కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది వేగవంతం చేశారు.

కొండాపురంలో కాంప్లెక్స్ సమావేశం

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సెక్టోరియల్ అధికారి ఎస్తేర్‌రాణి మాట్లాడుతూ.. ఐఈసీ విద్యా విధానంలో బోధన ఎఫ్‌ఎల్‌ఎం తరగతుల పాఠ్యాంశాల ప్రణాళికపై చర్చించారు. విద్యార్థులకు టీంలుగా విభజించి బోధించడం, వారి స్థాయికి అనుగుణంగా పనికల్పించడం, తరగతి గదిలో బోధించాల్సిన ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భూతగాదా: రెండు వర్గాలపై కేసు నమోదు

ధరూరు: మండలంలోని మన్నాపురంలో పొలం గెట్ల విషయంలో రెండు వర్గాలు ఘర్షణ పడగా.. వారి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షుకూర్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ రాముడు, అదే గ్రామానికి చెందిన తిరుమలేష్, శ్రీను పంట పొలాలు పక్కపక్కనే ఉంటాయి. శుక్రవారం పొలం సాగు పనులు చేసుకునే క్రమంలో ఇరు వర్గాల వారు గుట్టు విషయంలో గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com